ప్రజా సేవకులకు సత్కారం

- ప్రభుత్వ పనితీరుకు వన్నె తెచ్చిన వలంటీర్లు
- నగరి నియోజకవర్గంలో 5 వజ్ర, 35 రత్న అవార్డులు
- అవార్డులతో బాధ్యత పెరిగిందంటున్న వలంటీర్లు



మంత్రి రోజా చేతుల మీదుగా సేవావజ్ర అవార్డు అందుకుంటున్న వలంటీర్లు అంజేరయ్య, తులసీరామ్

ఉషోదయానికి ముందే ఇళ్ల వద్దకు వచ్చి పింఛన్ అందిస్తారు.. ప్రభుత్వ పథకం కావాలంటే ఇంటి వద్దకే వచ్చి వివరాలు సేకరిస్తారు. ఆపై వారే దరఖాస్తు చేయించి పథకం లబ్ధిని అందేలా చూస్తారు.. వారికి కేటాయించిన కుటుంబాల్లో ఒకరిగా కలిసిపోయి నిత్యం ప్రజాసేవలో పరితపిస్తూ ప్రభుత్వ పనితీరుకే వన్నె తెచ్చారు వలంటీర్లు. వీరిని ప్రభుత్వం వివిధ అవార్డులు, రివార్డులతో ఘనంగా సత్కరిస్తోంది. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పని చేస్తూ అందరి చేత శభాష్ అనిపించుకుంటున్న ప్రజాసేవకులను ప్రభుత్వం గౌరవిస్తోంది.

పుత్తూరురూరల్: ప్రజలకు ఎల్లవేళలా ప్రభుత్వ సేవలను అందిస్తున్న వలంటీర్లను వారి పని తీరు ఆధారంగా ప్రభుత్వం వజ్ర, రత్న పేరిట అవార్డులతో సత్కరిస్తోంది. ఈ గౌరవ సత్కారాలు పది రోజుల పాటు అన్ని మండలాల్లో కొనసాగనున్నాయి. నగరి నియోజకవర్గంలో మొత్తం 1,313 మంది వలంటీర్లలో ఐదుగురు సేవా వజ్రా అవార్డులను గెలుచుకోగా, 35 మంది సేవా రత్నా అవార్డులను కైవసం చేసుకున్నారు. మిగిలిన 1,273 మందికి సేవా మిత్రా అవార్డులతో ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయా మండలాల్లో సత్కరించనున్నారు. తిరుపతిలో శుక్రవారం జరిగిన ×వలంటీర్లకు వందనం× కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడా శాఖ మంత్రి ఆర్‌కే రోజా చేతుల మీదుగా సేవావజ్రా అవార్డులను గెలుచుకున్న వారిని ఘనంగా సత్కరించారు. ప్రతి సేవావజ్ర అవార్డు గ్రహీతకు రూ.30 వేలు నగదు బహుమతితో పాటు, మెడల్, బ్యాడ్జితో పాటు సర్టిఫికెట్ ఇచ్చి గౌరవించారు. సేవారత్నలకు రూ.20 వేలు నగదు బహుమతితో కూడిన సన్మానాలు, సేవామిత్రలకు రూ.10 వేలు నగదు, షీల్డుతో సన్మానించనున్నారు.

నగరి నియోజకవర్గంలో సేవావజ్ర అవార్డు అందుకొన్న వలంటీర్లు

మండలం	పంచాయతీ	వలంటీర్ పేరు	నగదు బహుమతి
పుత్తూరు	తడుకు	ఏ.అంజేరయ్య	రూ. 30 వేలు
పుత్తూరు	తడుకు	కె.తులసీరామ్	రూ. 30 వేలు
పుత్తూరు	దాసరిగుంట	ఎం.కె.ఢిల్లీరాణి	రూ. 30 వేలు
వడమాలపేట	తిరుమణ్యం	జి.ఉదయశ్రీ	రూ. 30 వేలు
నగరి	వీకేఆర్‌పురం	వి.భారతి	రూ. 30 వేలు

బాధ్యత పెరిగింది..

అవార్డు రావడంతో మా బాధ్యత మరింత పెరిగింది. రాష్ట్రప్రభుత్వం మహిళలను సైతం వలంటీర్లుగా తీసుకుని మాకు సమాజంలో ప్రత్యేక గౌరవాన్ని కల్పించింది. నా పరిధిలో 70 కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందించడం నాకు ఎంతో సంతృప్తిని ఇచ్చింది. చిత్తశుద్ధితో పని చేస్తున్న మమ్మల్ని గుర్తించి అవార్డులు ఇచ్చి ప్రోత్సహించడం మంచి పరిణామం. సేవావజ్ర అవార్డు రావడం నా జీవితంలో మరిచిపోలేని సంఘటన.
–వి.భారతి, సేవావజ్ర వలంటీర్, నగరి



మేము ప్రభుత్వ బలగమే..

వలంటీర్లు అందరూ ప్రజల పక్షమే. మేమంతా ప్రభుత్వ బలగమే. ఎవరు ఎన్ని మాటలన్నా ఇది నిజం. ఎందుకంటే ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా మేము పనిచేస్తున్నాం. సేవావజ్ర అవార్డు సాధించడం ద్వారా మా బాధ్యత మరింత పెరిగింది. ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పటికీ రుణపడి ఉంటాం. నా పరిధిలో ఉన్న కుటుంబాల్లో ప్రతి ఒక్కరినీ నా కుటుంబ సభ్యులుగా భావించి పనిచేశా.
–ఎం.కె.ఢిల్లీరాణి, సేవావజ్ర వలంటీర్, పుత్తూరు



సీఎం జగనన్నతోనే రాష్ట్ర అభివృద్ధి


లబ్ధిదారులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

- గడపగడపకు మన ప్రభుత్వానికి అన్యూహ స్పందన
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం): రాష్ట్ర అభివృద్ధి సీఎం జగనన్నతోనే సాధ్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. శనివారం పాతవెంకటాపురం, పాతపాళ్యం, పాతపాళ్యం ఎస్టీకాలనీ, మిట్టకొత్తూరు, గుట్టమాకుల కండ్రిగ, కొత్తవెంకటాపురం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం రెండోరోజు కొనసాగింది. ఉప ముఖ్యమంత్రి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకవైపు అభివృద్ధి, మరోవైపు ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గ్రామస్థాయిలో అధికారులు సేవలు అందించేందుకు గ్రామీణ ప్రాంతాల్లో సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్‌క్లినిక్‌లు తదితర వాటిని నిర్మించి ప్రభుత్వ అధికారులను ప్రజల ముందుకు తీసుకొచ్చిన ఘనత కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. కులమతాలకు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తూ పేదరిక నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగనన్న మాత్రమే అన్నారు. అన్ని సామాజిక వర్గాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ప్రత్యేక నిధులతో వారి అభివృద్ధికి తోడ్పాటు అందించడం జరుగుతుందన్నారు. రైతులు పంట సాగు చేసుకోవడానికి ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఏటా క్యాలెండర్ ప్రకారం రైతు భరోసా అందిస్తూ రైతన్నలకు వెన్నుదన్నుగా ప్రభుత్వం నిలుస్తోందని గుర్తు చేశారు. ప్రతి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి అన్యూహ స్పందన లభిస్తోందన్నారు. చంద్రబాబు అధికార దాహంతో ప్రభుత్వం చేపడుతున్న ప్రతి సంక్షేమ పథకాలపై తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను నమ్మించేందుకు చూస్తున్నాడని, అయితే ప్రతి ఇంటికీ లక్షల రూపాయలు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులు అందుకుంటున్నారని, ప్రజలే బాబుకు రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం నేర్పేందుకు సిద్ధంగా ఉన్నారని గుర్తు చేశారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ పాతపాళ్యం ఎస్టీకాలనీ వాసులకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని, అనుభవంలో ఉన్నవారికి పట్టాలు ఇవ్వాలని, గ్రామానికి తాగునీటి ట్యాంకు ఏర్పాటు చేయాలని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అదేవిధంగా వెంకటాపురం గ్రామానికి సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని, గతంలో అసంపూర్తిగా నిలిచిపోయిన పక్కాగృహాలకు బిల్లులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. స్పందించిన ఆయన గ్రామాల్లో సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. అలాగే మిట్టకొత్తూరులోని ఓ దివ్యాంగుడికి ప్రభుత్వం ద్వారా అందించిన ట్రైసైకిల్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అనిత, మండల పార్టీ కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి, ఎంపీటీసీ లారెన్స్, నాయకులు మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శంకర్, నరసింహులు నాయుడు, పెద్దబ్బనాయుడు బాబునాయుడు, బలరామరెడ్డి, ఎంపీడీఓ శ్రీదేవి, తహసీల్దార్ ఇన్బనాథన్ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హోమ్‌గార్డు ఆత్మహత్య

పెనుమూరు(చిత్తూరు అగ్రికల్చర్): ఆత్మహత్య చేసుకుని హోమ్‌గార్డు మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా.. గాగమ్మగారిపల్లికి చెందిన పద్మేష్‌బాబునాయుడు(42) తిరుచానూరు పోలీస్‌స్టేషన్‌లో హోమ్‌గార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతను గత నాలుగు నెలలుగా విధులకు హాజరు కాలేదు. దీనికితోడు మద్యానికి బానిస అయ్యాడు. పైగా కుటుంబ కలహాలు తోడవడంతో మనస్థాపానికి గురై ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ అనిల్‌కుమార్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత


చెక్కు అందిస్తున్న నారాయణస్వామి

గంగాధరనెల్లూరు (కార్వేటినగరం): క్యాన్సర్ బాధితురాలికి రూ.3 లక్షల చెక్కును డిప్యూటీ సీఎం నారాయణస్వామి అందజేశారు. మండలంలోని వరత్తూరు పంచాయితీ దళవాయిపల్లికి చెందిన గాయత్రి గత కొంతకాలంగా బ్లడ్ క్యాన్సర్ బారిన పడి హాస్పిటల్లో చికిత్స పొందడానికి డబ్బులు లేక పొలం అమ్మి చికిత్స చేయించుకుంటోంది. ఇప్పటికే చికిత్స కోసం రూ.5 లక్షల పైగా ఖర్చు అయింది. ఈ విషయం తెలిసి వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.3 లక్షలు మంజూరయ్యేలా డిప్యూటీ సీఎం చొరవ తీసుకున్నారు. శనివారం ఆమెకు అందించారు. బాధితురాలు గాయత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సాయం అందించిన సీఎం జగనన్నకు, డిప్యూటీ సీఎం నారాయణస్వామికి రుణపడి ఉంటానన్నారు.

పర్యావరణాన్ని రక్షించుకుందాం

శ్రీరంగరాజపురం: మొక్కలు విరివిగా పెంచి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని అటవీ శాఖ బీట్ అధికారి సతీష్ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని చిన్నతయ్యూరు జగనన్న కాలనీలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో చెట్లను నరికి వేయడం వల్ల వాతావరణ కాలుష్యం ఏర్పడి ప్రజలు వివిధ రకాలైన వ్యాధులతో బాధ పడుతున్నారని తెలిపారు. ప్రతి ఇంటికీ రెండు మొక్కల చొప్పున ప్రతిఒక్కరూ మొక్కలను నాటి కాలుష్య రహిత సమాజానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వరదమ్మ, పంచాయతీ కార్యదర్శి జ్యోత్స్న, మహిళా పోలీస్ ఉషారాణి, వెల్ఫేర్ అసిస్టెంట్ ఉమాదేవి, నాయకులు మణి పలువురు పాల్గొన్నారు.

శివరామిరెడ్డి సేవలు ఎనలేనివి

శ్రీరంగరాజపురం: సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ శివరామిరెడ్డి సేవలు ఎనలేనివని మాజీ వాటర్‌షెడ్ చైర్మన్ గుణశేఖర్‌నాయుడు అన్నారు. శనివారం సప్తగిరి బ్యాంకు మేనేజర్ శివరామరెడ్డి బదిలీపై వెళ్తున్న సందర్భంగా ఖాతాదారులు పలువురు మేనేజర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గుణశేఖర్‌నాయుడు, బ్యాంకు సిబ్బంది, నాయకులు పలువురు పాల్గొన్నారు.

పుత్తూరు విద్యార్థుల ప్రతిభ

పుత్తూరు రూరల్: పుత్తూరు పట్టణంలోని ప్రభుత్వ పిళ్లారిపట్టు పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు పాలిసెట్‌లో మంచి ప్రతిభ కనబర్చినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎస్వీ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఉచిత శిక్షణ పొందిన 134 మంది విద్యార్థులు పాలిసెట్ 2023 పరీక్షలు రాయగా 97 మంది క్వాలిఫై అయినట్లు తెలిపారు. ఇందులో నలుగురు విద్యార్థులు లక్ష్మీప్రసాద్, చరణ్‌తేజ, మనీష్‌కుమార్, మల్లీశ్వరీ 10 వేలలోపు ర్యాంకు సాధించడం విశేషమన్నారు. ఉచిత శిక్షణ నిర్వాహకులు శ్రీనుబాబు, అధ్యాపకులు, విద్యార్థులను ప్రిన్సిపల్ కుమార్, పీఆర్‌ఓ ఆనందరావు అభినందించారు.

ప్రభుత్వ స్కూళ్లలోనే నాణ్యమైన బోధన


పిల్లల వివరాలు నమోదు చేస్తున్న టీచర్లు

నగరి: ప్రభుత్వ పాఠశాలల్లోనే అత్యున్నత బోధన అందిస్తున్నామని ఏకాంబరకుప్పం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు తెలిపారు. శనివారం వారు తమ పరిధిలో ఇంటింటికీ వెళ్లి బడిఈడు పిల్లల వివరాలను నమోదు చేయించారు. ప్రభుత్వం అందిస్తున్న జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యాకానుక కిట్ ఇతర ప్రోత్సాహకాలు గురించి వివరించారు. హెచ్‌ఎం వీఎస్ హరిదాస్, మహిళాపోలీస్ తేజ, వెల్ఫేర్ అసిస్టెంట్ నవీనవాణి, అంగన్‌వాడీ టీచర్ విజయ పాల్గొన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల శాతం పెంచాలని కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ వినాయకం అన్నారు. శనివారం బలిజకండ్రిక, కేజే పురం, వనదుర్గాపురం, పాలసముద్రం గ్రామాల్లో అధ్యాపకులు పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలల్లోనే ఉన్నతవిద్య అందుతుందన్నారు.

జూడో పోటీల్లో ప్రతిభ


పతకాలు సాధించిన విద్యార్థులు

వడమాలపేట : అనంతపురం జిల్లా కల్యాణదుర్గంలో ఈ నెల 18, 19 తేదీల్లో జరిగిన అండర్–19 స్కూల్ గేమ్స్ జూడో పోటీల్లో వడమాలపేట బాలుర పాఠశాల విద్యార్థులు లతాశ్రీ 50 కేజీల విభాగం, యశ్వంత్ 71 కేజీలు, భవిత 36 కేజీల విభాగంలో వెండి పతకం, చరణ్ 71 కేజీలు, విభాగంలో కాంస్య పతకాన్ని సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భువనేశ్వరి తెలిపారు. శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్‌రాజును, విద్యార్థులను శాప్ డైరెక్టర్ యాదవేంద్రరెడ్డి అభినందించారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మంత్రి


ఉగ్రాణపల్లిలో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు

పెనుమూరు(చిత్తూరు అగ్రికల్చర్): గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటించినప్పుడు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామికి తమ గ్రామంలో సీసీ రోడ్డు వేయాలని ఉగ్రాణపల్లి సర్పంచ్ మురళీరెడ్డి, గ్రామస్తులతో కలిసి విన్నవించారు. అయితే ఇచ్చిన మాటకు కట్టుబడి మంత్రి నారాయణస్వామి గ్రామానికి సీసీ రోడ్డు ఏర్పాటు చేశారని సర్పంచ్ మురళీరెడ్డి అన్నారు. శనివారం ఉగ్రాణపల్లి గ్రామానికి ఏర్పాటు చేసిన సీసీ రోడ్డును సందర్శించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మా గ్రామస్తులకు మంత్రి ఇచ్చిన హామీని త్వరగా నెరవేర్చి ప్రజలకు ప్రభుత్వం సత్తాను గుర్తు చేశారని తెలిపారు.

ఘనంగా ప్రసన్న వేంకటేశ్వరుడి గ్రామోత్సవం


తిరుమాడ వీధుల్లో దర్శనమిస్తున్న ప్రసన్న వేంకటేశ్వరుడు

వడమాలపేట: మండల పరిధిలోని అప్పలాయగుంటలో వెలసిన టీటీడీ అనుబంధ ఆలయంలో శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి తిరుచ్చి గ్రామోత్సవం, ఊంజల్‌సేవను శనివారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి, తోమాలసేవ, నిత్యకైంకర్యాలు చేపట్టారు. అనంతరం సర్వదర్శనానికి భక్తులను అనుమతించారు. అనంతరం సర్వఅలంకార భూషితుడైన పద్మావతి ఆండాల్ సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామివారి ఉత్సవమూర్తిని మంగళవాయిద్యాలతో మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు నారికేళ, కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి విచ్చేసి స్వామివారికి మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం భక్తులు సర్వదర్శనానికి అనుమతించారు. రాత్రి స్వామివారికి ఏకాంతసేవ నిర్వహించారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, షరాబు రామకృష్ణ, సిబ్బంది సాయి పాల్గొన్నారు.

'మా భూములు మాకే ఇవ్వాలి'


నిరసన వ్యక్తం చేస్తున్న దళితులు

వడమాలపేట: గతంలో తమకు ఇచ్చిన వ్యవసాయ భూములను తమకే ఇవ్వాలని తహసీల్దారు కార్యాలయం ఎదుట దళితులు నిరసన వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని గంధపు హరిజనవాడకు చెందిన పలువురు మాట్లాడుతూ గత ప్రభుత్వం నిరుపేద దళితులమైన తమకు పట్టాలు మంజూరు చేసిందని, వాటికి సంబంధించి ప్రస్తుతం రెవెన్యూ రికార్డుల్లో ఏమీ లేవని తెలిపారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం ఇచ్చారు. దళిత సంఘాల నేతలు, సమాచారహక్కు చట్ట సభ్యులు పాల్గొన్నారు.

నాడు–నేడు పనులను త్వరగా పూర్తి చేయండి


పనులను పరిశీలిస్తున్న ఈఈ మధుసూదన్‌రావు

కార్వేటినగరం: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న నాడు–నేడు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎస్ఎస్ఏ ఈఈ మధుసూదన్‌రావు అన్నారు. శనివారం మండల పరిధిలోని కొల్లాగుంట, ఆర్కేవీబీపేట గ్రామాల్లో జరుగుతున్న నాడు–నేడు పనులను ఎస్ఎస్ఏ ఈఈ మధుసూదన్ రావు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023–24 విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోపు ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. నాడు–నేడు పనులకు బిల్లులు ఎప్పటికప్పుడు ప్రభుత్వం అందిస్తోందని గుర్తు చేశారు. పనుల్లో నాసిరకానికి తావు లేకుండా నాణ్యతతో కూడిన పనులు చేయాలని సూచించారు. అనంతరం ఆర్కేవీబీపేట ఉన్నత పాఠశాలలో నిర్మాణం జరుగుతున్న నాడు–నేడు పనులను ఆ పాఠశాల హెచ్‌ఎంతో కలసి సందర్శించారు. ఈఈ వెంట ఎస్ఎస్ఏ ఏఈ నాగభూషణం, ఆయా స్కూళ్ల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పలువురు ఉన్నారు.

లేగదూడలకు టీకాలు

పాలసముద్రం: బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలను నాలుగు నుంచి ఎనిమిది నెలల లేగదూడలకు వేయడం ద్వారా వ్యాధిని అరికట్టవచ్చని పశువైద్యాధికారి యశ్వి తెలిపారు. శనివారం ఆమె పాలసముద్రం సచివాలయ ఆవరణలో పాడిరైతులకు సమావేశం నిర్వహించారు. నాలుగు నుంచి ఎనిమిది నెలల లేగదూడలకు తప్పకుండా వ్యాక్సినేషన్ వేయించాలన్నారు. వ్యాధి బారిన పడిన పశువులు తాగే నీటివల్ల, తినే పశుగ్రాసం వల్ల ఇతర పశువులకు వ్యాధి సోకుతుందన్నారు. ఈ వ్యాధి నివారణకు ప్రభుత్వం ఉచితంగా వ్యాక్సిన్ వేయడానికి చర్యలు చేపట్టిందన్నారు. ఈ మేరకు అన్ని గ్రామాల్లో షెడ్యూల్ ప్రకారం వ్యాక్సిన్ వేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం లేగదూడలకు, పాడిపశువులకు టీకాలు వేశారు.


డ్రోన్‌తో మందుల పిచికారీని ప్రయోగాత్మకంగా చూపెడుతున్న వ్యవసాయ సంచాలకులు

రాయితీపై రైతులకు డ్రోన్లు

పెనుమూరు(అగ్రికల్చర్ చిత్తూరు): వ్యవసాయ రంగం అభివృద్ధికి రాయితీపై ఆధునిక పరికరాలు అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చిత్తూరు సహాయ వ్యవసాయ సంచాలకులు మధుసూదన్ రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని శాతంబాకం గ్రామంలో డ్రోన్ ద్వారా మందులు పిచికారీని ప్రయోగాత్మకంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదుగురు రైతులు గ్రూపుగా ఏర్పడి ఆధునిక వ్యవసాయ పనిముట్ల కోసం దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం 50 శాతం రాయితీపై పరికరాలను అందించడానికి సిద్ధంగా ఉందన్నారు. అలాగే రూ.50 లక్షలు విలువ చేసే ఆధునిక డ్రోన్లను కూడా రాయితీపై అందిస్తామన్నారు. రైతు సంఘాలు ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఓ కల్యాణ్‌బాబు, రైతు భరోసా కేంద్రం సిబ్బంది, వ్యవసాయ సహాయకులు, రైతులు పలువురు పాల్గొన్నారు.

మౌలిక వసతుల పరిశీలన


వసతి గృహంలో మౌలిక వసతులను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కార్వేటినగరం: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలతో పాటు ప్రభుత్వ వసతి గృహాలకు నాడు–నేడు ద్వారా మహర్దశ రానుందని జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బాలికల సమీకృత వసతి గృహాన్ని, అలాగే ఎస్సీ బాలికల వసతి గృహాన్ని ఎంపీడీఓ మోహన్‌మురళి, ఎస్ఎస్ఏ ఏఈ నాగభూషణంతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సమీకృత వసతి గృహంలో మైనర్ రిపేర్ల కింద ట్యాప్‌లు, కిటకీలకు, గేట్లకు మెస్‌ల ఏర్పాటు, వసతిగృహం చుట్టూ ప్రహరీ నిర్మాణం, సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. అనంతరం ఎస్సీ బాలికల వసతి గృహాన్ని సందర్శించి వార్డెన్ బాబుతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గిరి, సమీకృత వసతిగృహం వార్డెన్ హేమలత తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ఫలాలను ప్రజలకు అందించండి

– మండల మీట్‌లో మంత్రి ఆర్‌కే రోజా



పర్యావరణంపై ప్రతిజ్ఞ చేస్తున్న మంత్రి ఆర్‌కే రోజా, సమావేశానికి హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

నగరి: మండలపరిషత్ ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న ప్రభుత్వ ఫలాలను ప్రజలకు అందించే వారదులుగా ఉండాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజనసర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. శనివారం మండలపరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ భార్గవి అధ్యక్షతన నిర్వహించిన మండల సాధారణ సర్వసభ్య సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత ఎంపీపీ మండలంలోని అధికారులు వారి శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించాలని కోరారు. వ్యవసాయ అధికారి రాఘవేంద్ర మాట్లాడుతూ వ్యవసాయశాఖలో జరిగిన అభివృద్ధి పనులను వివరిస్తూ ప్రస్తుతం జనుము, జీలుగ విత్తనాలను సబ్సిడీపై అందిస్తున్నామని, భూసార పరీక్షలు చేపడుతున్నామని తెలిపారు. ఉద్యానవన అధికారి లోకేష్ మాట్లాడుతూ మామిడి తోటల్లో కాయలను నిల్వచేసుకునే షెడ్లు నిర్మించడానికి సబ్సిడీ అందిస్తున్నామని చెప్పారు. ఇరిగేషన్ ఏఈ రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రి సహకారంతో మొక్కలచేను కండ్రిగ వద్ద ఆనకట్ట నిర్మిస్తున్నామని తద్వారా 4 వేల మంది రైతులకు సాగునీరు అందించడం జరుగుతుందన్నారు. హౌసింగ్ డీఈ శంకరప్ప మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించని వారిని ప్రోత్సహించి పూర్తి చేయిస్తామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శైలేంద్ర మాట్లాడుతూ నగరి మండలానికి 45 వాటర్ ట్యాంకులు, నియోజకవర్గానికి 100 ట్యాంకుల వరకు మంజూరు చేయించిన ఘనత మంత్రి రోజాకే దక్కుతుందని ప్రశంసించారు. వైద్యశాఖ అధికారులు మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ ద్వారా గ్రామాల్లోనే వైద్యసేవలు అందిస్తున్నట్లు చెప్పారు. మత్స్యశాఖ అధికారి మాట్లాడుతూ ఫిష్ మార్కెట్ మంజూరైందని స్థలం కేటాయిస్తే నిర్మాణం చేపడతామన్నారు. 50 ఏళ్లు దాటిన మత్స్యకారులకు పింఛన్ అందిస్తున్నట్లు చెప్పారు. అటవీశాఖ అధికారులు పర్యావరణ హిత జీవనం (లైఫ్) కార్యక్రమం గురించి వివరించి మంత్రితో పాటు అధికారుల చేత ప్రతిజ్ఞ చేయించారు.

అభివృద్ధి పనులను పూర్తి చేయండి..

అనంతరం మంత్రి మాట్లాడుతూ సంక్షేమ పథకాల ఫలాలను ప్రజలకు అందించడంతో పాటు ప్రభుత్వం చేస్తున్న మంచిని వారికి వివరించే బాధ్యత ప్రజాప్రతినిధులపైనే ఉందన్నారు. గడపగడపలో మంజూరైన అభివృద్ధి పనులన్నీ త్వరగా పూర్తి చేయమని అధికారులను ఆదేశించారు. జూన్‌లోపు జగనన్న కాలనీల్లో ఇళ్లు పూర్తయ్యేలా చూడాలన్నారు. ఎండ తీవ్రత ఎక్కువ ఉందని, గ్రామాల్లో ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా చూసుకోవాలని సూచించారు. వడగాలులు వీస్తున్నందున అన్ని ప్రభుత్వ హాస్పిటళ్లలో పరికరాలు, మెడిసిన్స్ అందుబాటులో ఉండాలని, ఏమైనా అవసరమైతే తన దృష్టికి తెస్తే తన చారిటబుల్ ట్రస్టు ద్వారా అందిస్తానన్నారు. ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానించాలని ప్రజాప్రతినిధులు కోరగా ఈ అంశంపై తాను ఇదివరలోనే అధికారులతో చర్చించడం జరిగిందని మంత్రి సమాధానమిచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శేషగిరిరావు, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, సీడీపీఓ కృష్ణవేణి, వైస్ ఎంపీపీలు వెంకటలక్ష్మి, కన్నియప్ప, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

పాత వస్తువులను ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌లో ఇవ్వండి



నగరి: ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది

నగరి: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నగరి పురపాలక సంఘం సంతమైదానంలోని 'మేరా లైఫ్–మేరా స్వచ్ఛనగర్ 'ఆర్‌ఆర్‌ఆర్' (రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్) సెంటర్‌ను మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు జూన్ 4వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. (రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్) సెంటర్‌ను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇళ్లలో నిరుపయోగంగా ఉన్న దుస్తులు, బూట్లు, చెప్పులు, టోపీలు, పరుపులు, బెడ్‌షీట్లు, దుప్పట్లు, పుస్తకాలు, బ్యాగ్‌లు, పిల్లలు ఆడుకునే బొమ్మలు, సైకిళ్లు, చెక్క కుర్చీలు, ఇనుప కుర్చీలు, టేబుళ్లు, చెక్క మంచాలు, ఇనుప మంచాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు తదితర వస్తువులను ఈ సెంటర్‌లో అందించాలన్నారు. వారు వాటి అవసరం ఉన్న ఇతరులకు అందజేస్తారన్నారు. ఈ సెంటర్‌కు నిరుపయోగంగా ఉన్న వస్తువులు ఇవ్వాలనుకున్న వారు తమ ప్రాంతంలోని శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీకి సమాచారం అందిస్తే, వారు మీ వద్ద వస్తువులను సేకరించి ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌కు తరలిస్తారన్నారు. మనం వినియోగించని వస్తువులను ఇతరులకు ఉపయోగపడేలా చొరవ తీసుకుంటున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సేవలకు పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పుత్తూరులో..

పుత్తూరు రూరల్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పుత్తూరు పట్టణంలో రెడ్యూస్, రియూజ్, రీసైకిల్ (ఆర్‌ఆర్‌ఆర్) సెంటర్‌ను ప్రారంభించినట్లు మున్సిపల్ చైర్మన్ ఏ.హరి తెలిపారు. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ ఆదివారం నుంచి జూన్ 4వ తేదీ వరకు రీసైక్లింగ్‌కు ఉపయోగపడే పాత పుస్తకాలు, దుస్తులు, అట్టలు, బూట్లు, కుర్చీలు, ఇతర పాత వస్తువులను పెద్దఎత్తున సేకరిస్తున్నట్లు చెప్పారు. అన్ని సచివాలయాల వద్ద ఏర్పాటు చేసిన ట్రిబుల్ ఆర్ సెంటర్లలో ప్రజలు స్వచ్ఛందంగా పాత వస్తువులను అందజేసి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కెఎల్ఎన్‌రెడ్డి, వైస్ చైర్మన్ డి.శంకర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.